వాడీవేడిగా బోర్డు సమావేశం

- కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర ఆధ్వర్యంలో నిర్వహణ
- బోర్ల భారం బోర్డే భరించాలి : ఎమ్మెల్యే శ్రీగణేశ్
- నిధులు మంజూరుకు కృషి : ఎంపీ ఈటల రాజేందర్

బిల్డింగ్ బైలాస్-2024 డ్రాఫ్ట్‌కు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బోర్డు సమావేశం వాడీవేడిగా జరిగింది. సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయవర్షీ, బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 90 ఏళ్ల తర్వాత రూపొందించిన నూతన బిల్డింగ్ బైలాస్ ముసాయిదాకు ఆమోదం తెలిపి, కేంద్రం అనుమతికి పంపింది. ప్రజలకు తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన బాధ్యత బోర్డుదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బోర్డుకు రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం, రాష్ట్రం అని బేధాలు వద్దని, అవన్నీ ప్రజల సొమ్మేనని ఎంపీ స్పష్టం చేశారు. ఆయా మార్గాల ద్వారా నిధులు రాబట్టుకుని ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలని బోర్డుకు సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల ద్వారా బోర్డుకు దక్కే పరిహారంతో బోర్డు పరిధిలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. నిరుపయోగంగా ఉన్న నేతాజీనగర్ ప్రభుత్వ పాఠశాల స్థలంలో శివమందిర్ ఏర్పాటు చేయాలని బోర్డు సభ్యురాలు నర్మద కోరారు.

నీళ్లిచ్చే బాధ్యత బోర్డుదే : ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్ వ్యాప్తంగా ప్రభుత్వ నిధులతో వేసే బోర్‌వెల్స్ నిర్వహణ బాధ్యత బోర్డే చూసుకోవాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. అయితే నిధుల కొరత కారణంగా వాటి భారం భరించలేమంటూ సీఈఓ చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేనప్పుడు బోర్డు ఎందుకని ప్రశ్నించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే సాయన్న తన వ్యక్తుల ద్వారా అక్రమ కనెక్షన్లతో బోర్‌వెల్స్‌కు విద్యుత్ సదుపాయం కల్పించారంటూ బోర్డు అధికారులు చెప్పడం బాధ్యతారాహిత్యం అంటూ మండిపడ్డారు. కంటోన్మెంట్ పరిధిలో 916 బోర్‌వెల్స్ ఉండగా, 516 మాత్రమే బోర్డు నిర్వహణలో ఉన్నాయని, వాటి నిర్వహణకు నెలకు రూ.50 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఉచిత నీటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వమే నెలకు రూ. 80 లక్షల మేర రాయితీ ఇస్తోందని గుర్తుచేశారు.

బోర్డు నిర్ణయాలకు మేమూ బాధ్యులమే

- కంటోన్మెంట్ బోర్డు సమావేశాల్లో ఎంపీ, ఎమ్మెల్యేకు ఓటు హక్కు కల్పించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు.
- బోర్డులో తీసుకునే నిర్ణయాలకు ఎంపీ, ఎమ్మెల్యే కూడా బాధ్యులే కదా అన్నారు. గతంలో లాల్‌బజార్‌లోని గాంధీ కమ్యూనిటీ హాల్‌ను బోర్డు సభ్యులు డంపింగ్ యార్డుగా మార్చారని గుర్తుచేశారు. ఓటింగ్ లేకపోవడం వల్లే అప్పటి ఎమ్మెల్యే తనకు బాధ్యత లేదని తప్పించుకున్నారని విమర్శించారు.
- తాను గతంలో కోరడంతోనే రక్షణ స్థలాల్లోని బస్తీలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించారని గుర్తు చేశారు.
- అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వడం తప్ప, చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఏవైనా అభ్యంతరాలుంటే తనకు ప్రత్యేకంగా చెప్పాలని సీఈఓ పేర్కొనడం గమనార్హం.

నిధులేవైనా ప్రజల సొమ్మే : ఎంపీ ఈటల

కేంద్రం, రాష్ట్రం భేదం లేకుండా ఏ నిధులైనా ప్రజల సొమ్మేనంటూ శ్రీగణేశ్ పేర్కొడాన్ని ఎంపీ ఈటల రాజేందర్ సమర్థించారు. కేంద్రం నుంచి రావాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు, రాష్ట్రం నుంచి రావాల్సిన టీపీటీ బకాయిల వివరాలు తనకు ఇస్తే, ఫాలో అప్ చేస్తానని ఎంపీ సూచించారు. సర్వీసు చార్జీల బకాయిలపై తీర్మానం చేస్తే తాను న్యాయపోరాటం చేసి సాధిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కంటోన్మెంట్‌లో ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిస్తే, 20 ఏళ్లు ఉండే అవకాశముందని సీఈఓ చమత్కరించగా, ఎమ్మెల్యే శ్రీగణేశ్ స్పందిస్తూ తాను ఒక్కసారి ఉన్నా చాలని నమ్ముకున్న ప్రజలకు సేవ చేస్తానని, అదే 20 ఏళ్లు అధికారంలో ఉండాలంటే అన్నింటా రాజీ పడాల్సి వస్తుందని పేర్కొన్నారు.

గోశాలపై అస్పష్టత

తుర్కపల్లిలోని 14 ఎకరాల కంటోన్మెంట్ స్థలంలో ఎకరం స్థలాన్ని గోశాల ఏర్పాటుకు అప్పగించాలన్న బోర్డు ప్రతిపాదనపై సందిగ్ధత నెలకొంది. బోర్డుకు ఆదాయం వచ్చేలా ఆ స్థలాన్ని వినియోగించాలంటూ ఎమ్మెల్యే సూచించారు. దీంతో గోశాలకు స్థలం అప్పగింతపై అస్పష్టత నెలకొంది.

ఎన్నికలు నిర్వహించేలా చూడండి

కేంద్రాన్ని ఒప్పించి బోర్డు ఎన్నికలు నిర్వహించి, కంటోన్మెంట్‌లో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎంపీ ఈటలను కోరారు. 3, 4 నెలల్లోనే బోర్డు ఎన్నికలు జరిగే అవకాశముందంటూ ఎంపీ ప్రతిస్పందించారు.

బైసన్ పోలో పేరు మార్పు

ప్యారడైజ్ సమీపంలోని 38 ఎకరాల బైసన్ పోలో మైదానంలో క్రీడా సదుపాయాలు కల్పించి, పూర్తిస్థాయి క్రీడా ప్రాంగణంగా మారుస్తామని సీఈఓ తెలిపారు. అయితే ఈ మైదానం పేరును సైతం కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మార్చాలంటూ అధ్యక్షుడు నంజుండేశ్వర సూచించారు.

బిల్డింగ్ బైలాస్-24 డ్రాఫ్ట్‌కు ఆమోదం

- సమావేశం ఆరంభానికి ముందే, సీఈఓ మధుకర్ నాయక్ కంటోన్మెంట్ బిల్డింగ్ బైలాస్ -2024 డ్రాఫ్ట్‌ను వివరించారు.
- 1935 తర్వాత అడపాదడపా చిన్నపాటి సవరణలు మినహా కంటోన్మెంట్‌లో బిల్డింగ్ బైలాస్‌లో మార్పులు జరగలేదు. 2017లో రూపొందించిన నూతన బిల్డింగ్ బైలాస్‌ను కేంద్రం పరిశీలనకు పంపగా, నేటికీ పెండింగ్‌లోనే ఉంది. తాజాగా కేంద్రమే మరోసారి డ్రాఫ్ట్‌ను రూపొందించాలని సూచించింది.
- తాజా సికింద్రాబాద్ కంటోన్మెంట్స్ యాక్ట్ -2006, నేషనల్ బిల్డింగ్ కోడ్-2016కు లోబడి నూతన బిల్డింగ్ బైలాస్‌ను రూపొందించారు.
- కొత్తగా జోనల్ విధానంతో పాటు ప్రస్తుతమున్న ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) పరిమితిని 1.5 నుంచి జోన్ల వారీగా గరిష్ఠంగా 2.5కు పెంచుతూ ప్రతిపాదనలు రూపొందించారు.
- అక్రమ నిర్మాణాల కట్టడికి మార్టిగేజ్ విధానంతో పాటు గరిష్ఠంగా 10 శాతం అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు.
- నిర్మాణ వైశాల్యాన్ని బట్టి రెండు సెల్లార్లు, స్టిల్ట్, గ్రౌండ్ ప్లస్ త్రీ ఫ్లోర్ల వరకు నిర్మాణాలు చేపట్టే వెసులుబాటు కల్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అమీర్‌పేట శీష్‌మహల్, ప్లే గ్రౌండ్, దివ్యశక్తి లేన్, డీకేరోడ్డు, మాజీ గవర్నర్ రోశయ్య నివాస లేన్, శివబాగ్‌కాలనీ, శాంతిబాగ్, కేకేజోన్ హోటల్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13 నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 35, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 8, క్యారెట్ 23, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 26, కందగడ్డ 80, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌లోని ఎల్ఎస్‌నగర్‌లోని నాలా బ్లాకేజ్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, ఏఈ లావాణ్య, బాకర తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ క్యాంటీన్ టెండర్ ఖరారు




మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో రైతులు, హమాలీలు, ట్రేడర్స్‌కు సదుపాయాలు కల్పించడంతో పాటు మార్కెట్ ఆదాయం పెంచడమే లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు పేర్కొన్నారు. మార్కెట్ యార్డు క్యాంటీన్ టెండర్లను మంగళవారం ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారం అందించే వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మొత్తం నలుగురు కాంట్రాక్టర్లు పోటీపడగా, అధికంగా రూ.2.80, 786 టెండరు వేసిన రితికేష్‌కు క్యాంటీన్ అప్పగించాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో క్యాంటీన్ టెండర్ ద్వారా మార్కెట్‌కు కేవలం రూ.72 వేల ఆదాయం వచ్చేదన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్: మైనర్లకు వాహనాలు ఇచ్చినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు హెచ్చరించారు. మెట్టుగూడ ఆలుగడ్డబావి కూడలిలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టి పలువురు వాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపించే తల్లిదండ్రులు ఇతరులు ఎవరైనా కూడా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

బీఆర్ఎస్ నేత హఠాన్మరణం



సత్యనారాయణ (ఫైల్)

సనత్‌నగర్: బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత చిట్యాల సత్యనారాయణ (68) హఠాన్మరణం చెందారు. మంగళవారం ఆయన గుండెపోటుకు గురి కాగా ఆయనను బేగంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే పెద్దమొత్తంలో ఖర్చవుతుందని భావించిన కుటుంబ సభ్యులు సీఎంఆర్ఎఫ్ ద్వారా నిమ్స్‌లో చికిత్స అందించవచ్చనే ఉద్దేశంతో నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. సత్యనారాయణ సుదీర్ఘకాలంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతూ వచ్చారు. జీహెచ్ఎంసీ డివిజన్ వార్డు కమిటీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ధీరజ్, యువరాజ్ ఉన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ స్థాయి ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీలు వాణీదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, పలు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఈనెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని డివిజన్లలో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తామన్నారు. అలాగే పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా అదే రోజు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివెళ్తామని చెప్పారు. సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఈనెల 9 నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. 20న గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బాడీ సమావేశం ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

లష్కర్ జిల్లా ఏర్పాటుకు మద్దతు



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సికింద్రాబాద్: లష్కర్ జిల్లా సాధనకు తన మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హామీనిచ్చారు. లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధుల బృందం మంగళవారం తన నివాసంలో ఆమెను కలిసింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం వినతిపత్రం అందజేశారు. వారితో సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని. అలాగే వచ్చే శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. లష్కర్ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో సంస్థ ప్రతినిధులు ఏ.బాలరాజ్ యాదవ్, శైలేందర్, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ చారి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ వినయ్ ఆంటోనీ అన్నారు. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని కాలేజ్ క్యాంపస్‌లో ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వలంటర్లు మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ వినయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. సమయానికి రక్తం దొరకక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ప్రతి 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

హుస్సేన్‌సాగర్‌లో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం



రాంగోపాల్‌పేట్: కుటుంబ కలహాలతో హుస్సేన్‌సాగర్‌లో దూకిన ఓ మహిళను హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కాపాడింది. స్థానికుల కథనం ప్రకారం.. బాలానగర్ రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన 36 ఏళ్ల ఓ మహిళ ట్యాంక్‌బండ్‌పై నుంచి హుస్సేన్ సాగర్‌లో దూకింది. అక్కడే ఉన్న హైడ్రా సిబ్బంది గమనించి మహిళను కాపాడారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు యత్నించినట్లు మహిళ తెలిపింది.

సాయినగర్ బస్తీ కమిటీ ఎన్నిక

లాలాపేట: దిశ కమిటీ సభ్యురాలు శారదా సమక్షంలో మంగళవారం సాయినగర్ బస్తీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సాయినగర్ (డబుల్ బెడ్రూం) బస్తీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా నర్సింగరావు, సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా పద్మ, రవిని ఎన్నుకున్నారు. శారదా మాట్లాడుతూ.. దాదాపు పదేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో సాయినగర్ బస్తీలోని దాదాపు 100 కుటుంబాల వారు ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే నివసించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆమె డిమాండ్ చేశారు.



ఓయూలో బస్సుల సంఖ్య పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన బస్సుల సంఖ్య పెంచాలని వారు కోరుతున్నారు. ఒక చోట నుంచి మరొక చోటికి వెళ్లాలంటే లోకల్‌గా రెండు మినీ బస్సులు ఏర్పాటు చేశారని అయితే విద్యార్థినుల సంఖ్య పెరగడంతో బస్సులు సరిపోవడం లేదన్నారు. అమ్మాయిలతో పాటు అబ్బాయిలకు కూడా క్యాంపస్‌లో బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవం



పూజల్లో టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి దీక్షితులు

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని చారిత్రాత్మక పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సుమారు 200 ఏళ్లకు పైబడిన చరిత్ర గల ఈ ఆలయాన్ని ఇటీవలే జీర్ణోద్ధరణ పూర్తి చేశారు. అది పూర్తి కావడంతో స్వామివారికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల స్వామి దీక్షితుల ఆధ్వర్యంలో మంగళవారం పలు పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వై నర్సారెడ్డి, ఈవో సత్యమూర్తి, సభ్యులు తేజ్‌పాల్, నరేందర్‌రెడ్డి, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాయి వెంకటేశ్, గోవిందన్, ఆంజనేయులు యాదవ్, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



బొల్లారం: కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత ఆధ్వర్యంలో తిరుమలగిరి పరిధిలోని టీచర్స్ కాలనీ, లాల్‌బజార్‌లోని మహంకాళి బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ అధ్యక్షుడు భిక్షపతి, కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు బంగారు సదానంద్, మారుతీ గౌడ్, సంతోష్ యాదవ్, వైష్ణవి, రేమండ్, ప్రదీప్, రంజిత్, శ్రీను, మహేష్, సాంసన్ రాజు, సత్యనారాయణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

25 నుంచి ఉచిత నాట్య శిక్షణ తరగతులు

సనత్‌నగర్: నాట్య శిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 30 వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు ఏ.వాసుకీ శ్రీనివాస్ తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ ఆలయ సముదాయంలోని శివా ల యం పైఅంతస్తులో గల హాల్‌లో కూచిపూడి, జానపద నృత్యాల్లో తరగతులు కొనసాగుతాయన్నారు. 5 ఏళ్ల వయస్సు ఉన్న బాలబాలికలు హాజరుకావచ్చన్నారు. ఆసక్తి గలవారు 16 నుంచి 20 వరకు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98493 55145, 8008825651 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అమీర్‌పేట ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



తల్లీబిడ్డతో వైద్య బృందం

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి శిశువు ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్‌కు చెందిన యాష్మిని (26) నిండు గర్భిణి. వారం రోజుల్లో ప్రసవం కావాల్సి ఉంది. అయితే ఈనెల 5న ఉదయం ఒక్కసారిగా బ్లీడింగ్ కావడంతో కుటుంబ సభ్యులు ఉదయం 10 గంటల సమయంలో అమీర్‌పేటలోని 50 పడకల ఆసుపత్రికి తీసుకువచ్చారు. గైనకాలజీ వైద్యులు పరీక్షలు చేయగా శిశువు గర్భసంచికి కనెక్ట్ అయ్యి ఉండాల్సిన మాయ విడిపోయినట్లు గుర్తించారు. తక్షణమే శస్త్ర చికిత్స చేయాలని లేకుంటే శిశువు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని సూపరింటెండెంట్ రవూఫ్, ఆర్ఎంఓ వినాయకరావు దృష్టికి తీసుకెళ్లగా వారి సూచన మేరకు శస్త్రచికిత్స చేసి బిడ్డను క్షేమంగా బయటకు తీశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సాధారణంగా ఇలాంటి కేసులను టీచింగ్ ఆసుపత్రికి పంపిస్తామని, అయితే గర్భిణి పరిస్థితి బట్టి ఇక్కడే శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చిందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా అనస్తీసియా, గైనకాలజీ, ఓబీజీ విభాగం వైద్యులను ఆయన అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సాయినగర్ కేంద్రంలో పలువురు గర్భిణులకు పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. అలాగే ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే ఆహారం, పాలు, గుడ్లు, బాలామృతం వంటి వాటిని కూడా ఇచ్చారు. అనంతరం 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృపావతి, సంధ్యారాణి, రోజా, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన షిర్డీ సాయి జయంత్యుత్సవాలు



జయంత్యుత్సవాల్లో ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేశ్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని షిర్డీసాయి జయంత్యుత్సవాలు మంగళవారం ముగిశాయి. బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రారంభం కాగా మూడురోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. గోపాలపురం ఏసీపీ సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్ నరేశ్, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు నందికంటి రవి, జ్ఞానేశ్వర్, సతీశ్, శేఖర్, సాయి, సందీప్, సంతోష్ పర్యవేక్షణ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



శిబిరంలో మహవీర్ ఆస్పత్రి సిబ్బంది

సనత్‌నగర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ ఆధ్వర్యంలో మహవీర్ హాస్పిటల్ సహకారంతో బేగంపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలువురికి రక్తపోటు, గ్లూకోజ్, హృదయ స్పందన రేటు, బరువు తదితర పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ సిబ్బందితో పాటు మహవీర్ ఆస్పత్రి వైద్యులు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై అభ్యంతరకరమైన వీడియో..

వైరల్ చేసిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై అభ్యంతరకరమైన వీడియోను వైరల్ చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఆర్‌నగర్‌లో ఉంటున్న 43 ఏళ్ల ఓ మహిళ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన వర్షిణి టీవీ నిర్వాహకుడు సరేందర్, చిలుకా గంగాధర్ ఆమెపై అభ్యంతరకరమైన వీడియోలు తయారు చేసి వైరల్ చేశారు. 2001లో వివాహం అయ్యాక కూడా వేధింపులు ఆపలేదు. దీంతో అప్పట్లో రామాయంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగాధర్‌పై కేసు నమోదు చేశారు. మెదక్ కోర్టులో కేసు నడుస్తుండగానే పెద్ద మనుషుల జోక్యంతో ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. మరోసారి ఆమె జోలికి వెళ్లనని గంగాధర్ అందరి సమక్షంలో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వగా ఆమె కేసును ఉపసంహరించుకుంది. అయితే ఇటీవల తిరిగి ఎప్పటిలాగే ఉపాధ్యాయురాలిపై అభ్యంతరకరమైన వీడియోలు వైరల్ చేసి వేధింపులకు పాల్పడుతుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.